క్లుప్తంగా

హెల్మెట్‌తోనే ప్రాణరక్షణ



దెందులూరు పోలీస్ సిబ్బందికి హెల్మెట్ అందిస్తున్న డీఎస్పీ లక్ష్మయ్య

దెందులూరు : హెల్మెట్‌తోనే ప్రాణ రక్షణ లభిస్తుందని, ద్విచక్రవాహనం నడిపే ప్రతి వ్యక్తీ నిర్లక్ష్యం వహించకుండా హెల్మెట్ ధరించాలని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. గురువారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ హమీద్, సిబ్బందికి హెల్మెట్లను డీఎస్పీ అందించారు. పోలీస్ శాఖ నుంచి అవగాహన, నిబంధనల అమలు చేయాలన్నది తన అభిప్రాయమన్నారు.

హుండీ ఏర్పాటుకు విరాళం



దాత వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దెందులూరు : గాలాయగూడెం శ్రీఅచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయంలో హుండీ ఏర్పాటుకు పూజారి వెంకటేశ్వరరావు గురువారం రూ.45 వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు దాత వెంకటేశ్వరరావును సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.

పాస్టర్లకు సత్కారం



వీజేఎల్‌ఎం చర్చిలో పాస్టర్లను సత్కరిస్తున్న సంఘస్తులు

దెందులూరు : గ్రామ శివారు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక అభివృద్ధికి వీజేఎల్‌ఎం చర్చి సిబ్బంది కృషి చేస్తున్నారని చర్చి వ్యవస్థాపకులు పాస్టర్ బి.సిల్వర్టు కుమార్, బి.జీవమణి అన్నారు. గురువారం మసీదుపాడులో చర్చి వార్షికోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా వారిని సంఘస్తులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

రాట్నాలమ్మ తల్లికి సారె



అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

పెదవేగి: శ్రీ రాట్నాలమ్మవారి ఆలయంలో గురువారం ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామస్తులు రాట్నాలమ్మవారికి సారెను అందజేశారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేకాలంకరణ చేశారు.

సీసీఆర్‌సీ కార్డుల అందజేత

పెదపాడు : కౌలు రైతులంతా సీసీఆర్‌సీ కార్డులు పొందాలని రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని కొక్కిరపాడు గురువారం గ్రామంలో కౌలురైతుల సమావేశం నిర్వహించి సీసీఆర్‌సీ కార్డులు అందజేశారు. ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీఆర్వో పుట్టా అజయ్ పాల్గొన్నారు.

6700 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

దెందులూరు: మండలంలో 6,700 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ తెలిపారు. గురువారం ఆయన దెందులూరులో వరినాట్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ సాగుపనులు యథాతథంగా సాగుతున్నాయని, 14 వేల ఎకరాలకు 6,700 ఎకరాల్లో నాటు పూర్తయ్యాయని రమేష్ చెప్పారు.

గుడిలోకి దూసుకెళ్లిన లారీ

ఏలూరు టౌన్: ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే ప్రధాన రహదారిలో మాదేపల్లి రోడ్డు పక్కన ఉన్న గంగానమ్మ ఆలయంలోకి రొయ్యల లోడు లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన డ్రైవర్‌ను స్థానికులు 108 అత్యవసర అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గంగానమ్మ గుడి గోడ పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు, రేపు సీపీఎం సమావేశాలు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 19న జంగారెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో నిర్వహించే సీపీఎం జిల్లా కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో కోరారు. 19న ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, 20వ తేదీన జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ హాల్‌లో సీపీఎం విస్తృత సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, మంతెన సీతారాం హాజరవుతారని తెలిపారు.

ఎడతెరిపిలేని వానతో జనజీవనం అస్తవ్యస్తం



గణపవరం : నారుమడిలో చేరిన నీటిని బయటకు తోడుతున్న రైతు



భీమడోలు : గుండుగొలను బ్రిడ్జి వద్ద ఏర్పడిన గోతుల్లో ఆటోలో భయం భయంగా వెళ్తున్న ప్రయాణికులు



భీమడోలు : ఇందిరా కాలనీలో రోడ్లపైకి వచ్చిన నీరు



దెందులూరు : వరి నాట్లను పరిశీలిస్తున్న ఏవో రమేష్, సిబ్బంది



ఉంగుటూరు : బాదంపూడి వద్ద కురుస్తున్న వర్షం



భీమడోలు : పాతూరు వద్ద వెలవెలబోయిన హైవే



గణపవరం : బురదతో నిండిన పంచాయతీరోడ్డు

గణపవరం : గురువారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. పల్లపుప్రాంతాలు జలమయమై, జనం బయటకు రావడానికి కూడా వీలులేక ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన జోరువాన అంతకంతకు పెరుగుతూ సాయంత్రం వరకు హోరున కురుస్తూనే ఉంది. దీంతో గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నారుమడులలోకి భారీగా వర్షంనీరు చేరడంతోనారు నీటమునిగింది. గణపవరం, సరిపల్లె, కొమ్మర, అర్ధవరం తదితర గ్రామాల్లో నారుమడులలో చేరిన నీటిని రైతులు బయటకు తోడుకుంటున్నారు. రెండు మూడు రోజుల క్రితం నాట్లువేసిన పొలాల్లో కూడా నాట్లు తేలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గణపవరం మండలంలో ఇప్పటివరకూ మూడు వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఇంకా రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పొలాలు ముంపు బారిన పడే ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు.

క్షీణిస్తున్న పారిశుధ్యం

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి గ్రామాల్లో పారిశుధ్యం క్షీణిస్తోంది. మురుగు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తుండటంతో డ్రెయిన్‌లోని మురుగునీరు రోడ్లపైకి చేరి బురదమయంగా తయారై నడవడానికి వీలులేకుండా తయారయ్యాయి. పంచాయతీ సిబ్బంది డ్రెయిన్ల ప్రక్షాళన, రోడ్లపై చేరిన బురద, మట్టి తొలగింపు పనులు చేపట్టారు. వర్షం నీరు నిల్వలేకుండా కాలువలు చేర్పాటుచేసి బయటకు తరలిస్తున్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

ఉంగుటూరు : మండలంలో గురువారం ఉదయం నుంచీ ఏకదాటిగా వర్షం కురుస్తునే ఉంది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. కాలువలు వర్షం నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. ఉంగుటూరు మండలంలో 63.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తోకలపల్లి మేజరు కోడులో ఉధృతంగా ప్రవహిస్తోంది. పందికోడు, రంగారావుకోడు, రాచకోడు, ఇతర మీడియం, మైనర్ డ్రెయిన్లకు నీరు పోటెత్తింది. పంట పొలాలు నీటమునిగాయి. బాదంపూడి నుంచి నాచుగుంట వరకు ఉన్న క్వారీ మురుగుబోదె పొంగి ప్రవహిస్తోంది. పలు గ్రామాల్లోని కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే నారాయణపురం, ఉంగుటూరు, కైకరం, చేబ్రోలు సెంటర్లు నిర్మానుష్యంగా కనిపించాయి. బాదంపూడి వద్ద జాతీయ రహదారి పైకి వర్షపు నీరు చేరింది.

వరి నాట్లు మునక.. రోడ్లు అధ్వానం

భీమడోలు : మండల వ్యాప్తంగా గురువారం తెల్లవారు జాము నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తునే ఉంది. వాతావరణ శాఖ మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీరంతా పోలసానిపల్లి నుంచి భీమడోలు జంక్షన్ చేరుతోంది. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కొల్లేరు గ్రామాలు ఇతర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో వర్షపు నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు తూతూమంత్రంగా సాగుతుండడంతో అనారోగ్యం బారిన పడతామన్న భయం ప్రజల్లో నెలకొంది. భీమడోలు ఇందిరాకాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండంతో నీరంతా రోడ్లపై నిలిచింది. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుండుగొలను బెయిలీ బ్రిడ్జి వద్ద గోతులతో నిండిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. సంబంధిత శాఖల అధికారులు ఆ గోతులను పూడ్చాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా మొదలు కావడంతో కొన్ని రోజుల కితమే వేసిన వరి నాట్లు వర్షార్పణ మవుతున్నాయి. ఆదిలోనే వరుణుడు దెబ్బని చవి చూడాల్సి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అండర్‌పాస్‌లోకి చేరిన నీరు



దెందులూరు : అండర్‌పాస్‌లో చేరిన వర్షపునీరు

దెందులూరు : దెందులూరు – అలుగులగూడెం అండర్‌పాస్‌లో మళ్లీ వర్షపు నీరు చేరింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోట్ల రూపాయలతో నిర్మించిన అండర్‌పాస్ పైభాగంలో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో దెందులూరు వైపు, అలుగులగూడెం వైపు వర్షపునీరు కిందకు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రైల్వే శాఖాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



గణపవరం లయన్స్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

గణపవరం: సామాజిక సేవా కార్యక్రమాల అమలులో లయన్స్ సంస్థకు మరేసంస్థ సాటిరాదని, లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్స్ ఈపూరి సత్యనారాయణ, పర్వతనేని సుభాష్‌బాబు తెలిపారు. గణపవరం లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గణపవరం లయన్స్‌క్లబ్ భవనంలో ఈపూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్య, ఆరోగ్యరంగాలతో పాటు పర్యావరణంపై లయన్స్ ప్రత్యేక సేవా కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. సైట్ ఎట్ ఫస్ట్ కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందికి ఉచితంగా కంటిచూపు అందించినట్టు చెప్పారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పచ్చిపులుసు నాగేశ్వరావు, ఉపాధ్యక్షులుగా కె.నాగశేషారావు, ఎస్ వీర నాగయ్య, కార్యదర్శిగా సత్తినీడి నాని, కోశాధికారిగా కె.విశారద ఇతర సభ్యులచే ఇన్‌స్టాలింగ్ అధికారి వేమా కోటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. వారిని పలువురు పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రముఖులు వెల్లంకి నరేష్, పోశింశెట్టి రామూర్తి, రావూరి నాగరాజు, కె.సత్యనారాయణ మూర్తి, లివింగ్ స్టన్, ఎంజీపీ నర్సింహారావు, నారాయణశ్రీను, వంకాయల పంచముఖి, కె.రామకృష్ణ, కిలారి రవి, చవ్వా రవి, కాకర్ల వినాయక, ఎం హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని స్థాపిద్దాం



గుండుగొలను కూడలిలో సిబ్బంది మానవహారం

భీమడోలు : కుష్టు వ్యాధి రహిత సమాజస్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ వ్యాధుల నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీలో గురువారం వైద్యాధికారిణి కె.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, రోగులకు అవగాహన కల్పించారు. గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కుష్టు నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని.. కుష్టు అంటు వ్యాధి కాదని, నివారణకు మందులు ఉన్నాయంటూ నినదించారు. పలు కూడళ్లలో మానవహారంగా ఏర్పడి ప్రజలను చైతన్యపర్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు 15 రోజుల పాటు పారదర్శకంగా, పగడ్బందీగా చేపట్టాలన్నారు. కుష్టును ప్రారంభదశలో గుర్తిస్తే వ్యాధి నివారణ సాధ్యమవుతుందని చెప్పారు. కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చర్మంపై స్పర్శలేని, నొప్పి లేదా దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని, రాగి రంగు మచ్చలు కనిపించినా, చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బుడిమెలు, కన్ను రెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, నొప్పిగా ఉన్న నరాలు వంటి లక్షణాలు ఉన్నవారికి వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి ఆరోగ్య చికిత్సను అందించాలని తెలిపారు. 2 నుంచి 5 మచ్చలు ఉన్నవారికి ఆరు నెలల పీబీ కేసులు, ఐదు కన్నా ఎక్కువగా ఉన్న వారిని ఎంబీ కేసులుగా గుర్తించి వారికి ఏడాది పాటు చికిత్స అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు కె.శ్రీలక్ష్మి, జాహ్నవి, డీపీఎంఓ కె.సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కె.సత్యానందం, హెచ్‌ఈ మల్లేశ్వరి, ఎంపీహెచ్‌ఎస్ ఎస్‌కే నవీన్, ఎంపీహెచ్ డి.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

బాలికలకు అండగా కొత్త చట్టాలు



హైస్కూల్లో కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గణపవరం: బాలికల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, బాల్యం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రావతి అన్నారు. గురువారం గణపవరం బాలికల ఉన్నత పాఠశాలలో కొత్తగా వచ్చిన మూడు చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రావతి మాట్లాడుతూ విద్యార్థినులు, బాలికలపై అత్యాచారాలు, బాల్య వివాహాలు, పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు తదితర చట్టాలను వివరించారు. హెచ్‌ఎం బాలభాస్కరరావు మాట్లాడుతూ బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి ఇబ్బందికి గురైనా టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గణపవరం నెం.1 పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. బాలికలను చదువులో ప్రోత్స హించాలని, బాలికలు పుట్టడం అదృష్టంగా భావించాలని కోరారు. సమావేశంలో హెచ్‌ఎం మూరచిన్న ఏసు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక వడ్డీ ఇచ్చే చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు



బ్యాంకులో లాకర్‌ను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

దెందులూరు : ప్రభుత్వ బ్యాంకుల్లో అధికంగా వడ్డీ ఇచ్చే ఏకైక బ్యాంకు చైతన్య గోదావరి బ్యాంకు ఒక్కటేనని ఆ బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం దెందులూరులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ జి.నాగార్జున ఆధ్వర్యంలో నూతన భవనంలోనికి కార్యాలయాన్ని మార్పు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములపై తనఖా లేకుండా ఎకరాకు రూ.3 లక్షల వరకు సాగు నిమిత్తం రుణం ఇస్తున్నట్టు చెప్పారు. దెందులూరు సమీప గ్రామాల్లోని వినియోగదారులు చైతన్య గోదావరి బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు లాకర్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త కలపాల చంద్రశేఖర్ (బుజ్జి)తో ప్రారంభించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రెడ్డి, రీజనల్ మేనేజర్ శ్రీదేవి, బ్యాంకు మేనేజర్ నాగార్జున, గ్రామ నాయకులు శివాజీ, బ్యాంకు సిబ్బంది, వినియోగదారులు ఉన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ సభలు

పెదపాడు : మండలంలోని 23 గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీల వద్ద నిర్ణీత సమయంలో ఉపాధి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది తెలిపారు. తోటగూడెంలో ఈనెల 19న నాయుడుగూడెం, తోటగూడెం, తాళ్లగూడెం, 20న ఏపూరు, కొక్కిరపాడు, కలపర్రు, 21న సత్యవోలు కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, 22న వీరమ్మకుంట, వట్లూరు, 23న రాజుపేట, అప్పనవీడు, పెదపాడు, 24న కొత్తూరు, ఎస్ కొత్తపల్లి, జయపురం 25 గుడిపాడు, పునుకొల్లు, గోగుంట కొణికి, వడ్డిగూడెం, వసంతవాడ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

వన్‌స్టాఫ్ సేవలపై అవగాహన

ఏలూరు (టూటౌన్): వన్‌స్టాఫ్ సేవలను మహిళలు వినియోగించుకోవాలని సీడీపీఓ ఎ.పద్మావతి సూచించారు. మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వెంకట్రావుపేట స్కూల్‌లో మహిళలకు వన్‌స్టాఫ్ సెంటర్, ఉమెన్ హెల్ప్‌లైన్, చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. వన్‌స్టాఫ్ ద్వారా అందించే సేవలు, బాధిత మహిళలకు అందించే తక్షణ సహాయం, మహిళా అభివృద్ధికి శిశు సంక్షేమ శాఖ ద్వారా అందించే సేవలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ ఎ.పద్మావతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ కార్యాలయ నోడల్ ఆఫీసర్ స్వరాజ్య లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం దేవి, కార్యకర్తలు మౌనిక, ప్రియాంక, వన్‌స్టాప్ సిబ్బంది, స్కూల్ హెచ్‌ఎం, పలువురు మహిళలు పాల్గొన్నారు.

రైతాంగ హామీలను అమలు చేయాలి



ఐక్యతను చాటుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రలోని మోదీ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించి అమలు చేయాలని, అందుకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకొచ్చి దేశవ్యాప్తంగా ఒక దఫా రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతు, వ్యవసాయ కార్మికుడికీ పింఛన్ ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి కుటుంబానికీ ఏడాది 200 పనిదినాలు, రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, పురుగు మందులపై జీఎస్టీ రద్దు చేయాలని పేర్కొన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తి వేయాలని, అమరవీరుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఏపీ రైతు సంఘం, బీకేఎంయూ, వ్యవసాయ కార్మిక సంఘం, కాంగ్రెస్ కిసాన్ సెల్, ఏఐటీయూసీ నాయకులు డేగా ప్రభాకర్, కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, పి.రామకృష్ణ, పీబీవీ సుబ్రహ్మణ్యం, కేఎస్ఎస్ మూర్తి, ఎం.కృష్ణచైతన్య పాల్గొన్నారు.